ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి

కాసాని గెలుపు కోసం

కలిసికట్టుగా కృషి చేయాలి

షాబాద్ : చందనవెల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పు, పార్లమెంట్ ఎన్నికల్లో చేయబోమని, బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రజలే చెబుతున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో తెలంగాణ నుంచి బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే సమస్యలపై పోరాటం చేస్తారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు అడగాలని సూచించారు. మూడోసారి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, కుమార్తె మాధవి, జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి సతీమణి సాన్విరెడ్డి, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండాల గ్రామంలో ప్రచారం

చేవెళ్ల రూరల్ : కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నారు. గుండాల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు చూసి ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కే బ్రహ్మరథం పడుతున్నారని, జ్ఞానేశ్వర్‌ను గెలిపించి చేవెళ్ల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలవ్వాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలవాలి

వికారాబాద్ : కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఆరు గ్యారెంటీలను అమలు చేయించాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలవాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధి కొత్రేపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికి సుపరిచితుడు, అందరివాడు మన నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం అని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఎన్నో అభివృద్ధి పనులు జరిగి ఉండేవన్నారు. రూ.500లకు గ్యాస్, మహిళలకు రూ.2500, రుణ మాఫీ తదితర పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రవళిక, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, మాణిక్యం, రవి, రాములమ్మ పాల్గొన్నారు.

పరిగి : బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దగాకోరు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

పరిగి : దగాకోరు కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ పరిగిలోని 8వ వార్డులో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి గట్టు రాంచందర్‌రావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత మోసం చేసిందన్నది ప్రజలు గుర్తించారన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట గారడీ చేసిన కాంగ్రెస్‌ను నమ్మితే మరోసారి మోసపోతామని ప్రజలు పేర్కొంటున్నారన్నారు. మోసం కాంగ్రెస్ నైజంగా అభివర్ణించారు. కేవలం హామీలివ్వడం, వాటిని గాలికి వదిలేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. డిసెంబర్ 9న రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి అమలు చేయకపోతే ఆగస్టు 15న చేస్తామంటూ దేవుళ్లపై ఒట్లు పెట్టడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ అని, రైతు బంధు సైతం పూర్తిస్థాయిలో రైతులకు అందజేయని దుస్థితి నెలకొన్నదన్నారు. కాంగ్రెస్‌తోపాటు తమకు కష్టాలు వచ్చాయని గ్రహించిన ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. మరోవైపు పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఒనగూరిందేమీ లేదని ఆయన విమర్శించారు. రెండు జాతీయ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వికారాబాద్ : కొత్రేపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

కొడంగల్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- పీవో, ఏపీవో, ఓపీవోల శిక్షణా కార్యక్రమం పరిశీలన

కొడంగల్, మే 6 : లోక్‌సభ ఎన్నికలను సిబ్బంది పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 5 రోజులుగా కొనసాగుతున్న పీవో, ఏపీవో, ఓపీవోల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాగా.. 1316 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. వీరితో పాటు అదనంగా మరో 230 మంది రిజర్వు సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఓటింగ్ వేసే కేంద్రంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలో, ఏర్పాట్లు ఏవిధంగా ఉంటాయో వంటి అంశాలపై శిక్షణ పొందిన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సమయంలో సిబ్బంది పూర్తి అలర్ట్‌గా ఉండాలని, ఎటువంటి చిన్న తప్పిదం జరిగినా సహించేది లేదన్నారు.

అదేవిధంగా ఈవీఎం స్ట్రాంగ్ రూం సెంటర్‌లో చేపట్టిన మిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లలో బ్యాలెట్ పేపర్, అభ్యర్థులకు కేటాయించబడిన గుర్తుల అమరిక తీరును పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహణ, 17 సీపీఓ డైరీ రాయడం, పోలింగ్ ప్రాసెస్‌పై సూచనలు సలహాలను అందించారు. 243, 244 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి

- మైక్రో అబ్జర్వర్ల శిక్షణా తరగతుల్లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- పలు సూచనలు చేసిన జనరల్ అబ్జర్వర్ రాజేందర్ కుమార్ కటారియా


ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, జనరల్ అబ్జర్వర్ రాజేందర్ కుమార్ కటారియా

రంగారెడ్డి, మే 6 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7 గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి సామగ్రి సక్రమంగా అందిందా? లేదా! అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా? లేదా! అన్నది పరిశీలించాలని, ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఒక వేళ ఏజెంట్లు ఎవరూ హాజరు కాకపోతే 15 నిమిషాలు వేచి చూసిన మీదట మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిస్తున్న విధులను గమనించాలని.. టెండర్, ఛాలెంజ్ ఓటింగ్‌లు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు కలెక్టర్ సూచించారు. తరగతుల్లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులున్నారు.

సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఇప్పటివరకు సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన మొత్తం ఫిర్యాదులను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా లేదా బలవంతంగా ప్రభావితం చేసినా సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడుతుందని కలెక్టర్ తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీసీలు ఆగమే..!

బీసీల గొంతుక పార్లమెంటులో ఉండాల్సిందే..

బీసీ బిడ్డ కాసానిని గెలిపించుకుని తీరుతామంటున్న బీసీ సంఘాలు

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఆగమైపోతామని బీసీ సంఘాల నేతలు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మితే అధోగతిపాలవ్వడం ఖాయమని పేర్కొంటున్నారు. బీసీ కులాల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడంపై బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌కే మా మద్దతు అంటూ ముక్తకంఠంతో నేతలు పేర్కొంటున్నారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉంటే మన హక్కులను సాధించుకోగలుగుతామని చెబుతున్నారు. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను సైతం కలుపుకొని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుని తీరుతామని స్పష్టం చేస్తున్నారు. బీసీల హక్కుల సాధనకు జీవితాన్ని ధారబోసిన కాసానికి ప్రతిఒక్కరూ అండగా నిలువాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించి రాజకీయాలకు అతీతంగా కాసాని గెలుపునకు కృషి చేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు.

- రంగారెడ్డి, మే 6 (నమస్తే తెలంగాణ)

బీసీ నేత కాసానిని గెలిపించుకుందాం

చేవెళ్ల ఎంపీగా బరిలో నిలిచిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటే బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. గతంలో ఎంపీలుగా ఇద్దరు నాయకులు పదవులు అనుభవించి, సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరారు. ఆ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

- వడ్ల విష్ణు, చందనవెల్లి(షాబాద్)

పార్లమెంట్‌లో బీసీల గొంతు వినిపిస్తారు

చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో బీసీల గొంతు వినిపిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో గత 40 ఏండ్లుగా బీసీ సమస్యలపై పోరాటం చేస్తూ, 96 బీసీ కులాలను ఏకం చేసిన గొప్ప నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. అలాంటి బీసీ నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించడం సంతోషకరం.

- శ్రీశైలంగౌడ్, మక్తగూడ(షాబాద్)

బీసీలందరూ ఒకేతాటిపైకి రావాలి

జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలు తమ సత్తా చాటుకునే సువర్ణావకాశం ఈ ఎన్నికల రూపంలో వచ్చింది. ఈ సందర్భంగా బీసీలందరూ ఒకే తాటిపైకి రావడం ఎంతో అవసరం. ఇన్నాళ్లు బీసీలను ఇతర పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకోగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థి కాసానికి పార్టీ టికెట్ ఇవ్వడం మంచి నిర్ణయం.

- మేడిద రాజేందర్, నస్కల్, పరిగి మండలం

బీఆర్ఎస్‌లోనే బీసీలకు సముచిత స్థానం

బీఆర్ఎస్‌లోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుంది. రెండు జాతీయ పార్టీలు కేవలం ఓట్ల కోసం బీసీల జపం చేస్తున్నాయి తప్ప ఏ మాత్రం ప్రేమ లేదు. ఈ ఎన్నికల్లో బీసీలకు సగం స్థానాలు కేటాయించడం ద్వారా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలపై పార్టీకి గల శ్రద్ధను ఆచరణలో చూపించారు. ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం చేయని, సముచిత స్థానం ఇవ్వని రెండు జాతీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలి.

- కె.బాలయ్య, ఇబ్రహీంపూర్, పరిగి మండలం

బీసీ నాయకుడికి పట్టం కడుదాం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుదాం. సౌమ్యుడు, ఉన్నత విలువలు కలిగిన నాయకుడిని పార్లమెంటుకు పంపిద్దాం. బీసీల సమస్యలు తెలిసిన వ్యక్తి కాసాని. బీసీల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు. బీసీలను కూడగట్టడానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి. అగర్భ శ్రీమంతులతో తలపడుతున్న బీసీ బిడ్డకు మద్దతు ఇద్దాం.

- జమాల్పూర్ సునీతా బాల్‌రాజ్, జాతీయ బీసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అగర్భ శ్రీమంతులకు బీసీ ఉద్యమ నేతకు పోటీ

అగర్భ శ్రీమంతులకు బీసీ ఉద్యమ నేతకు పోటీ జరుగుతున్నది. ఎన్నో సంవత్సరాల నుంచి బీసీలను ఏకం చేయడానికి కాసాని చేయని పోరాటాలు లేవు. రెండు రాష్ట్రాల్లో ఉన్న బీసీల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. మన గురించి పట్టించుకునేవారికి ఓట్లు వేయకుండా ఇతరులకు ఓట్లు వేస్తే జాతిని తాకట్టు పెట్టినట్లు అవుతుంది.

- జయప్రద, తెలంగాణ ఆరె కటిక సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు

బీఆర్ఎస్ వస్తేనే బీసీల సంక్షేమం

బీసీల సంక్షేమం, అభివృద్ధిని కోరే బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుందాం. పార్లమెంట్‌లో బీసీల తరఫున పోరాడేందుకు పోటీలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఈ ఒక్కసారి బీసీకి అవకాశం ఇద్దాం. బీసీలెవరూ అమ్ముడుపోకుండా మన జాతి బిడ్డను గెలిపించుకుందాం. కేసీఆర్‌కు కానుకగా అందిద్దాం.

- భాగ్యలక్ష్మి, శేరిలింగంపల్లి

బురిడి కొట్టించే పార్టీలకు బుద్ధి చెబుదాం

మోసపూరిత హామీలతో మరోసారి గెలువాలనుకుంటున్న కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి. బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయం. అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదరించే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- దివ్య, శేరిలింగంపల్లి

బీసీ నేతకు టికెట్ కేటాయించడం గర్వకారణం

బీసీల సంక్షేమం కోసం కృషి చేసిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్‌ను జిల్లా ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారు. పార్టీలకు అతీతంగా బీసీలందరూ కలిసి ఆయనను గెలిపించాలి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి పనులు చేయడంతోపాటు మంచి పేరు తెచ్చుకున్న నాయకుడు జ్ఞానేశ్వర్. ఎన్నికల్లో బీఆర్ఎస్ 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించడం సంతోషకరం.

- శేఖర్, అత్తాపూర్

కాసాని గెలుపు పక్కా..

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు పక్కా. బీసీ యువకులందరూ గత 20 రోజులుగా ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడుతున్నాం. పార్టీలకతీతంగా ఆయనను గెలిపించుకుంటాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలంతా ఒక్కసారి ఆలోచించి కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తే బీసీల సమస్యలపై లోక్‌సభలో పోరాటం చేస్తారు.

- మణికంఠ, హైదర్‌గూడ

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని

రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేదిలేదు.

- మల్లికార్జున్, వికారాబాద్

బీసీల ఓట్లే అధికం

బడుగు బలహీన వర్గాలను అణగదొక్కుతూ రాజకీయాల్లో అవకాశం కల్పించడంలేదు. బీసీల ఓట్లే అధికంగా ఉన్నాయి. బీసీల ఓట్లతో ఎంతో మంది రాజ్యాధికారం చేపట్టారు. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. రాజ్యాధికారం కోసం బరిలో నిలుచున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది.

- మల్లికార్జున్, వికారాబాద్

బీసీలంతా ఏకతాటిపైకి..

ఈ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చారు. మా ఓటు మేమే వేసుకుంటాం. కాసాని 96 కులాల కోసం పోరాటం చేసిన మహా వ్యక్తి. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే నాయకుడు. మా బలమేంటో అర్థమయ్యేలా చేసి చూపిస్తాం. బీసీ హక్కుల కోసం పాటుపడే నాయకుడు బీసీ అభ్యర్థి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం.

- లక్ష్మప్ప ముదిరాజ్, గౌతాపూర్, తాండూరు

కేసీఆర్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయం. గ్రామాల్లో కేసీఆర్ నాయకత్వానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసేందుకు ఓటర్లు నిర్ణయించుకున్నారు. ప్రజా సమస్యలపై పూర్తిగా పట్టున్న నాయకుడు కాసానికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నది. ఈసారి బీసీని గెలిపించుకోకపోతే వచ్చేసారి బీసీలకు ఏ పార్టీ టికెట్లు ఇవ్వదు.

- నవీన్‌కుమార్, తాండూరు

నేడు షాబాద్‌లో బీఆర్ఎస్ రోడ్‌షో

హాజరు కానున్న మాజీ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

షాబాద్, మే 6 : మంగళవారం షాబాద్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రోడ్‌షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్‌లో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా షాబాద్‌లోని ప్రధాన చౌరస్తాలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 5వేల మందితో రోడ్‌షో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి రోడ్‌షోను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతీపద్మ

బధిరులు, అంధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలు

జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీపద్మ

వికారాబాద్, మే 6 : బధిరులు, అంధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీపద్మ అన్నారు. సోమవారం ఓటు వినియోగంపై కలెక్టరేట్‌లోని డీడబ్ల్యూవో చాంబర్‌లో స్వీప్ నోడల్ అధికారి ఎంఏ సత్తార్‌తో కలిసి బధిరులు, అంధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వీప్ కార్యాచరణలో భాగంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్‌లు, ర్యాంప్‌ల సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అంధులు బ్రెయిలీ లిపి బ్యాలెట్ పేపర్‌తో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగ ఓటర్లకు ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యంతోపాటు పోలింగ్ బూత్ వద్ద వీరికి సహాయకులుగా వలంటీర్లను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కాంగ్రెస్.. రైతు వ్యతిరేక ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిల్వచేసిన ధాన్యం పరిశీలన

ఆమనగల్లు, మే 6 : కాంగ్రెస్.. రైతు వ్యతిరేక ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిల్వచేసిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆచరణకు అమలుకాని మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలు తుంగలో తొక్కిందన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించకుంటే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు న్యాయం చేసే వరకు ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. అనంతరం మాడ్గుల మండల పరిధిలోని గిరికొత్తపల్లి గ్రామంలో జరిగిన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందే చింతలపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మున్సిపాలిటీ చెందిన కావటి పద్మమ్మ పిడుగుపాటుతో మృతి చెందారు. విషయం తెలుసుకుని వారి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారికి అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీటీసీ కుమార్, పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, సీనియర్ నాయకులు ఖలీల్, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్, రమేశ్, ప్రసాద్, భాస్కర్, గణేశ్, హనీఫ్, మహేందర్, శివ, శ్రీరామ్ ఉన్నారు.